సాక్షి
శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు
ఆదివారం । 5 । మే । 2024



అశేషంగా హాజరైన ప్రజానీకానికి బస్సులో నుంచి అభివాదం చేస్తున్న జగన్‌మోహన్‌రెడ్డి



జనసంద్రమైన గాంధీబొమ్మ సెంటర్ వద్ద ఫ్యాన్‌ను ప్రదర్శిస్తూ ప్రజలను ఉత్తేజపరుస్తున్న ముఖ్యమంత్రి జగన్

దద్దరిల్లిన సింహపురి

ఎన్నికల ప్రచారానికి నెల్లూరు విచ్చేసిన సీఎం జగన్

సంక్షేమ ప్రదాత, సీఎం జగన్‌మోహన్‌రెడ్డి రాకతో సింహపురి శనివారం దద్దరిల్లింది. తమ అభిమాన నేతను ప్రత్యక్షంగా చూడాలనే లక్ష్యంతో భారీగా తరలివచ్చిన ప్రజానీకంతో గాంధీబొమ్మ సెంటర్ జనసంద్రమైంది. ఆయన ప్రసంగాన్ని ఆద్యంతం ఆలకించి.. తమ కరతాళ ధ్వనులతో జేజేలు పలికారు. ఫ్యాన్ గుర్తుకు మరోసారి ఓటేసి.. జగనన్నను ముఖ్యమంత్రిని చేస్తామని ముక్త కంఠంతో తేల్చిచెప్పారు. మరోవైపు సీఎం రాకతో వైఎస్సార్‌సీపీ కేడర్‌లో నూతనోత్సాహం నెలకొంది. ఈ జనసునామీ.. పార్టీ విజయానికి సంకేతమని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

- పోటెత్తిన అభిమాన తరంగం
- మరోసారి మా ఓటు ఫ్యాన్‌కేనని నినదించిన ప్రజానీకం

మీ ఆశీస్సులు అవసరం

వైఎస్సార్‌సీపీ నెల్లూరు లోక్‌సభ, నెల్లూరు సిటీ, రూరల్ అభ్యర్థులు విజయసాయిరెడ్డి, ఖలీల్ అహ్మద్, ఆదాల ప్రభాకర్‌రెడ్డిని ఆశీర్వదించాలని సీఎం జగన్‌మోహన్‌రెడ్డి కోరారు. భారీగా హాజరైన ప్రజలకు వీరిని పరిచయం చేశారు. వీరందరూ సౌమ్యులు, మంచివారని.. వీరిని గెలిపిస్తే మీలో ఒకరిలా కలిసిపోయి.. సేవ చేస్తారని చెప్పారు.





విజయసాయిరెడ్డి, ఖలీల్ అహ్మద్, ఆదాల ప్రభాకర్‌రెడ్డిని ప్రజలకు పరిచయం చేస్తున్న సీఎం జగన్‌మోహన్‌రెడ్డి

సాక్షి ప్రతినిధి, నెల్లూరు: భానుడి భగభగలు.. ఎండ తీవ్రత అభిమాన ఝరి ముందు చిన్నబోయాయి. తమ అభిమాన నేతను చూసిన ఆనందంతో ప్రజలు కేరింతలు కొట్టగా.. ఉప్పెనలా తరలివచ్చిన అశేష జనవాహినితో సింహపురిలో పండగ వాతావరణం నెలకొంది. నగరంలోని గాంధీబొమ్మ సెంటర్‌లో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి శనివారం నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో ఈ ఘట్టం ఆవిష్కృతమైంది. పెత్తందారుల పక్షాన నిలిచిన చంద్రబాబును ఉద్దేశించి పంచ్ డైలాగులతో జననేత ప్రసంగించిన తీరు ప్రజలను ఆలోచింపజేసింది. మా నమ్మకం నువ్వే జగన్.. నీ వెంటే మేము అనే అనే నినాదాలు మార్మోగాయి.

మేమంతా సిద్ధం..

ప్రచార వాహనంపైకి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చేరుకోగానే, జగన్నినాదాలతో గాంధీబొమ్మ సెంటర్ మార్మోగిపోయింది. సీఎం ప్రసంగిస్తున్నంత సేపూ నేతలు, అభిమానులు ఉత్సాహంగా కేరింతలు కొట్టారు. సిద్ధమా అని జగన్ పిలుపునివ్వగా.. మేమంతా సిద్ధం అంటూ ప్రజలు పిడికిలి బిగించి గట్టిగా నినాదాలు చేశారు.



జేజేలు పలుకుతున్న మహిళాభిమాని



ప్రజలకు అభివాదం చేస్తున్న సంక్షేమ సారథి, చిత్రంలో ప్రసన్నకుమార్‌రెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి

మీ భవిష్యత్తును నిర్ణయించే ఎన్నికలు..

మరో తొమ్మిది రోజుల్లో జరగనున్న ఈ ఎన్నికలు ఎమ్మెల్యేలు, ఎంపీలను ఎన్నుకునేందుకు నిర్దేశించినవి కావని.. మీ భవిష్యత్తును నిర్ణయించే ఘట్టమని సీఎం వ్యాఖ్యానించారు. ఈ మాటలు నగర వాసుల్లో మరింత భరోసాను నింపాయి. ఈ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీకి ఓటేస్తే సంక్షేమ పథకాలు సజావుగా అందుతాయని.. పొరపాటున చంద్రబాబు అధికారంలోకి వస్తే వీటికి చరమగీతం పాడటం ఖాయమని జగనన్న చెప్పారు. గడిచిన 59 నెలల్లో అవినీతిరహిత పాలనను అందించామని, ఒక్కసారి ఆలోచించి తమ అమూల్యమైన ఓటును ఫ్యాన్ గుర్తు కేయాలని కోరారు. 2014 ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల్లో దేన్నైనా చంద్రబాబు అమలు చేశారానని సీఎం ప్రశ్నించగా, లేవు.. లేవంటూ ప్రజలు సమాధానమిచ్చారు.

దారిపొడవునా జేజేలు

ఎన్నికల ప్రచారం అనంతరం వీఆర్సీ గ్రౌండ్స్‌లో ఏర్పాటు చేసిన హెలిప్యాడ్ వద్దకు ప్రత్యేక వాహనంలో ఆయన వెళ్లారు. దారి పొడవునా జనం జేజేలు పలికారు. రెట్టించిన ఉత్సాహంతో అందరూ చేతులూపారు. మామయ్య వచ్చారంటూ చిన్నారులు కేరింతలు కొట్టారు. అనంతరం 6.10కు హెలికాప్టర్‌లో రేణిగుంటకు ఆయన పయనమయ్యారు. సర్వేపల్లి, కోవూరు, ఆత్మకూరు, ఉదయగిరి, కావలి అభ్యర్థులు కాకాణి గోవర్ధన్‌రెడ్డి, ప్రసన్నకుమార్ రెడ్డి, మేకపాటి విక్రమ్‌రెడ్డి, మేకపాటి రాజగోపాల్ రెడ్డి, రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి, నేతలు హనుమాన్‌రెడ్డి, మలిరెడ్డి కోటారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



విజయం మనదేనని నినదిస్తున్న యువతి



ఉప్పొంగిన అభిమానం



మలిరెడ్డి కోటారెడ్డిని పలకరిస్తున్న సీఎం



జననేతను చూసిన ఆనందంతో..



అన్ని దారులూ గాంధీబొమ్మ వైపునకే..



ఇసుకేస్తే రాలనంతలా మారిన గాంధీబొమ్మ సెంటర్



జగనన్నను చూసేందుకు తరలివచ్చిన ముస్లింలు

సోమిరెడ్డీ.. గ్రామాలకు దారులు తెలుసా?

• ప్రశ్నించిన మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి

పొదలకూరు: సోమిరెడ్డీ నీకు సర్వేపల్లి నియోజకవర్గంలో గ్రామాలకు దారులు తెలుసా? అని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి ప్రశ్నించారు. విమర్శలు చేయడం తప్పించి అభివృద్ధి గురించి మాట్లాడే దమ్ము ఆయనకు లేదన్నారు. మండలంలోని ఇనుకుర్తి, ముదిగేడు, డేగపూడి గ్రామాల్లో శనివారం మంత్రి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ చంద్రబాబును రాష్ట్ర ప్రజలు నమ్మడం లేదన్నారు. ఇచ్చిన ఏ ఒక్క హామీని అమలు చేయకపోవడంతోపాటు మోసగించడం వల్ల ఆయన సభలకు జనాలు కూడా వెళ్లడం లేదన్నారు. డబ్బులిచ్చి, వాహనాలు పెట్టినా వెళ్లేందుకు అయిష్టత చూపుతున్నట్లు చెప్పారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఒక్క పిలుపునిస్తే సభలకు జనాలు భారీగా తరలి వస్తున్నట్లు తెలిపారు. సంక్షేమ పథకాలతో ప్రజల గుండెల్లో ఉన్నారని అందువల్లే స్వచ్ఛందంగా వస్తున్నారన్నారు. పింఛన్ల కోసం వృద్ధులు బ్యాంకులకు వెళ్లి తిప్పలు పడుతున్నారని, వారి ఉసురు బాబుకు తగలక మానదన్నారు. గ్రామాల్లో ఏ అభివృద్ధి పనులు చేశానో ప్రచారంలో స్పష్టంగా చెబుతున్నానని, నువ్వు ఏమి చేశావో చెప్పాగలవా అంటూ సోమిరెడ్డిని నిలదీశారు. పొదలకూరులో చంద్రబాబు సభను నిర్వహిస్తే ఇనుకుర్తి, ముదిగేడు నుంచి పట్టుమని పదిమంది కూడా వెళ్లలేదన్నారు. ఇనుకుర్తి, డేగపూడి పంచాయతీలు తన సొంత గ్రామంతో సమానమన్నారు. వాటికి ఎడమగట్టు కాలువ ద్వారా సాగునీటిని అందించి తీరుతానన్నారు. జెడ్పీ చైర్మన్‌గా పనిచేసిన కాలంలోనే ముదిగేడుకు రోడ్డు నిర్మాణం చేపట్టిన విషయాన్ని గుర్తుచేశారు. కార్యక్రమంలో పార్టీ మండల కన్వీనర్ పెదమల్లు రమణారెడ్డి, సొసైటీ చైర్మన్ గోగిరెడ్డి గోపాల్‌రెడ్డి, జెడ్పీటీసీ నిర్మలమ్మ, సర్పంచ్‌లు పెదమల్లు శ్రీనివాసులురెడ్డి, ఓబుల్‌రెడ్డి, ఎంపీటీసీ పులి వెంకటేశ్వర్లురెడ్డి, నాయకులు అక్కెం రామకోటారెడ్డి, మండి శంకర్‌రెడ్డి, మండి శ్రీనివాసులురెడ్డి, నోటి రామలింగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ముదిగేడులో ఈవీఎం నమూనాను చూపుతున్న మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి

వృద్ధుల ప్రాణాలతో చంద్రబాబు చెలగాటం

• కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి

కొడవలూరు: పింఛన్లు ఇంటి వద్ద అందకుండా చేసి వృద్ధుల ప్రాణాలతో చంద్రబాబు నాయుడు చెలగాటమాడుతున్నాడని కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి విమర్శించారు. మండలంలోని రేగడిచెలిక, రాచర్లపాడు, పెయ్యలపాళెంలో శనివారం ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. పెయ్యలపాళెంలో మాట్లాడుతూ చంద్రబాబు తన మనిషి అయిన నిమ్మగడ్డ రమేష్ చేత ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేయించి వలంటీర్లు ఇంటి వద్ద పింఛన్లు పంపిణీ చేయకుండా నిలిపి వేయించారన్నారు. దీంతో పదుల సంఖ్యలో పింఛన్‌దారులు మృతిచెందారన్నారు. జిల్లాలో పెన్నా, సంగం బ్యారేజీలకు వైఎస్ రాజశేఖరరెడ్డి శంకుస్థాపన చేస్తే ఆయన కుమారుడు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పూర్తి చేశారని తెలిపారు. రైతులు బాగుంటే రాష్ట్రం బాగుంటుందని వారు నమ్మారన్నారు. బాబు పాలనలో వర్షాల్లేక రైతులు అల్లాడిపోయారన్నారు. పెయ్యలపాళెం అరబిందో ఫార్మా అధినేత రామ్‌ప్రసాద్‌రెడ్డి సొంత గ్రామమన్నారు. ఆయన తన నిధులతో ఎన్నో పనులు చేశారన్నారు. గ్రామస్తులకు ఆయన రుణం తీర్చుకొనే అవకాశం వచ్చిందని చెప్పారు. ఓట్లు వేసి నెల్లూరు ఎంపీ అభ్యర్థి వేణుంబాక విజయసాయి రెడ్డిని, అసెంబ్లీ అభ్యర్థిగా తనను గెలిపించాలని కోరారు. డీసీఎంఎస్ చైర్మన్ వీరి చలపతిరావు మాట్లాడుతూ వేమిరెడ్డి దంపతులు ప్రజా సేవే ముఖ్యమంటున్నారని, అలాంటి వారు పార్టీలు ఎందుకు మారారో ప్రజలు ప్రశ్నించాలన్నారు. కార్యక్రమంలో అరబిందో సంస్థ ప్రతినిధి పెనాక గోపీనాథ్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ, సచివాలయాల మండల కన్వీనర్‌లు గంధం వెంకటశేషయ్య, కొండా శ్రీనివాసులురెడ్డి, సర్పంచ్‌లు నల్లావుల శ్రీనివాసులు, పెనాక అనూష, ఎంపీటీసీలు పి.అరుణకుమారి, ఎ.రాజమ్మ, సొసైటీ చైర్మన్లు పెనాక నాగశ్రీనివాసులురెడ్డి, దేవనబోయిన శివకుమార్, మాజీ సర్పంచ్ పెనాక శారద, నాయకులు పెనాక సుభాష్‌రెడ్డి, అక్కుల్‌రెడ్డి, పెయ్యల రమణయ్య, ఎం.వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి, చిత్రంలో వైఎస్సార్‌సీపీ నాయకులు

నేటి నుంచి పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్

• ఈనెల 7వ తేదీ వరకు అవకాశం
• ప్రతి నియోజకవర్గ కేంద్రంలో ఫెసిలిటేషన్ సెంటర్
• ఎన్నికల అధికారి, కలెక్టర్ హరినారాయణన్

నెల్లూరు(దర్గామిట్ట): ఎన్నికల విధుల్లో ఉన్న ఉద్యోగులతోపాటు ఇతర సిబ్బంది ఆదివారం నుంచి పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు వేయొచ్చు. ఈనెల 7వ తేదీ వరకు నియోజకవర్గ కేంద్రాల్లో ఏర్పాటు చేసిన ఫెసిలిటేషన్ సెంటర్లలో ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఎం.హరినారాయణన్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం ఏడు నుంచి సాయంత్రం 6 గంటల వరకు సర్వీస్ ఓటర్లు ఆయా కేంద్రాల్లో పోస్టల్ బ్యాలెట్ల ద్వారా అసెంబ్లీ, పార్లమెంట్‌కు తమ ఓటు హక్కు వినియోగించుకోవచ్చన్నారు. కందుకూరులోని ఓవీ రోడ్డులోని జిల్లా పరిషత్ బాలికల హైస్కూల్లో, కావలిలోని జిల్లా పరిషత్ బాలుర హైస్కూల్లో, ఆత్మకూరులో పాలిటెక్నిక్ కాలేజీలో, కోవూరులోని పీఆర్ఎస్ జెడ్పీ బాలికల హైస్కూల్లో, ఉదయగిరిలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో, నెల్లూరు సిటీలోని డీకేడబ్ల్యూ కాలేజీలో, నెల్లూరు రూరల్‌కు సంబంధించి వీఆర్ లా కాలేజీలో, సర్వేపల్లికి సంబంధించి క్యూబా ఇంజినీరింగ్ కాలేజీలో ఫెసిటిలేషన్ సెంటర్లను ఏర్పాటు చేశామన్నారు. ఇతర జిల్లాల వారి కోసం నెల్లూరు దర్గామిట్టలోని జిల్లా పరిషత్ బాలుర హైస్కూల్లో కేంద్రం పెట్టామన్నారు. సుమారు 20 వేల మందికిపైగా ఉద్యోగులు పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు హక్కు వినియోగించుకోనున్నట్లు వెల్లడించారు.



వివరాలు తెలుసుకుంటున్న కలెక్టర్ హరినారాయణన్

క్యాజువల్ లీవ్ మంజూరు

ఎన్నికల విధులు కేటాయించబడిన ఉద్యోగులు వారికి కేటాయించిన ఫెసిలిటేషన్ సెంటర్లో పోస్టల్ బ్యాలెట్ వినియోగించుకునేందుకు కమిషన్ ఒకరోజు క్యాజువల్ లీవ్ మంజూరు చేసినట్లు కలెక్టర్ తెలిపారు.

పక్కాగా ఏర్పాట్లు

ఉద్యోగులు పోస్టల్ బ్యాలెట్ ఓట్లు వేసేందుకు అన్ని ఏర్పాట్లు పక్కాగా చేసినట్లు కలెక్టర్ హరినారాయణన్ పేర్కొన్నారు. నెల్లూరు నగరంలోని దర్గామిట్ట జిల్లా పరిషత్ హైస్కూల్లో ఏర్పాటు చేసిన ఫెసిలిటేషన్ కేంద్రంలో ఏర్పాట్లను కలెక్టర్ శనివారం పరిశీలించారు. గదుల కేటాయింపు, వెబ్ కాస్టింగ్ తదితరాల గురించి ఆరాతీశారు. పీఓ, ఏపీఓ, ఓపీఓలకు పోస్టల్ బ్యాలెట్‌పై నిర్వహిస్తున్న శిక్షణను పరిశీలించారు. కలెక్టర్ వెంట పోస్టల్ బ్యాలెట్ నోడల్ అధికారులు శ్రీనివాసులు, వెంకట్రావు ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి



శివయ్య మృతదేహం

అనుమసముద్రంపేట: రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతిచెందిన ఘటన మండల కేంద్రంలోని చందులూరుపాడు వద్ద శనివారం జరిగింది. పోలీసుల కథనం మేరకు.. సంగం మండలం పెరమన గ్రామానికి చెందిన తుమ్మల శివయ్య (30) సొంత పని మీద ఏఎస్‌పేట వైపు మోటార్‌బైక్‌పై వెళ్తున్నాడు. అదే సమయంలో అనుమసముద్రం గిరిజన కాలనీకి చెందిన సురేష్ హసనాపురం వైపు బైక్‌పై వెళ్తున్నాడు. చందులూరుపాడు వద్ద ఎదురెదురుగా వేగంగా బైక్‌లు ఢీకొనడంతో శివయ్య అక్కడికక్కడే మృతిచెందగా, సురేష్‌కు తీవ్ర గాయాలయ్యాయి. అతడిని ఆటోలో ఆత్మకూరు జిల్లా వైద్యశాలకు తరలించారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. కేసు నమోదు చేశారు.

పాపం పండుటాకులు

• పింఛన్ కోసం వెళ్లి ఇద్దరు వృద్ధుల మృతి

చంద్రబాబు నాయుడి కుట్రల వల్ల వృద్ధులు కన్నుమూస్తున్నారు. టీడీపీ కారణంగా ఇంటి వద్ద పింఛన్లు తీసుకునే అవకాశం లేకుండా పోయింది. దీంతో మండుటెండలో బ్యాంకులకు వెళ్లి వడదెబ్బకు గురై చనిపోతున్న పండుటాకుల సంఖ్య పెరుగుతోంది.

దుత్తలూరు: పింఛన్ కోసం బ్యాంకు వద్దకు వెళ్లి ఎండవేడిమికి తాళలేక వడదెబ్బకు గురై ఓ వృద్ధుడు మృతిచెందిన ఘటన దుత్తలూరు ఏసీ కాలనీలో జరిగింది. గ్రామస్తుల కథనం మేరకు.. యనమల రమణయ్య (67) అనే వృద్ధుడు పెన్షన్ సొమ్ము కోసం శుక్రవారం దుత్తలూరులోని బ్యాంకు వద్దకు వెళ్లాడు. రద్దీ ఎక్కువగా ఉండడంతో అధిక సమయం అక్కడే ఉన్నాడు. మండుటెండలోనే తిరిగి ఇంటికి వెళ్లాడు. కాసేపటికి తీవ్ర అనారోగ్యానికి గురయ్యాడు. రాత్రికి పరిస్థితి విషమంగా మారి మృతిచెందాడు.



వైనమ్మ (ఫైల్)

• కావలి: పట్టణంలోని కచ్చేరిమిట్ట చర్చి ప్రాంతంలో ఉంటున్న గద్దె వైనమ్మ (65) వృద్ధురాలు శనివారం వడదెబ్బకు మృతిచెందింది. బ్యాంకు నుంచి పెన్షన్ తెచ్చుకునేందుకు ఉదయం మండుటెండలో వెళ్లి అస్వస్థతకు గురైన ఆమె సాయంత్రం మృతిచెందింది.

జెడ్పీ సమావేశం వాయిదా

నెల్లూరు(పొగతోట): కోరం లేక జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం వాయిదా పడింది. చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ అధ్యక్షతన శనివారం నెల్లూరు జెడ్పీ సమావేశ మందిరంలో సర్వసభ్య సమావేశం ఏర్పాటు చేశారు. సభ్యులకు, అధికారులకు సీఈఓ కన్నమనాయుడు ఆహ్వానాలు పంపించారు. ఎన్నికల కోడ్ అమల్లో ఉన్న నేపథ్యంలో కొత్త వాటికి అనుమతి ఇవ్వకుండా, రాజకీయ అంశాలు చర్చించకుండా అధికారులతో సమీక్షించవచ్చని సీఈఓ తెలిపారు. నిబంధనలకు లోబడి మాత్రమే సమావేశం నిర్వహించేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు.



మాట్లాడుతున్న చైర్‌పర్సన్ అరుణమ్మ

అయితే నలుగురు జెడ్పీటీసీలు, కో–ఆప్షన్ సభ్యులు, అల్లూరు ఎంపీపీ మాత్రమే హాజరయ్యారు. కోరం లేకపోవడంతో వాయిదా వేస్తున్నట్లు అరుణమ్మ ప్రకటించారు.

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు

బ్రాయిలర్ (లైవ్)	: 147
లేయర్ (లైవ్)	: 90
బ్రాయిలర్ చికెన్	: 260
బ్రాయిలర్ స్కిన్‌లెస్	: 290
లేయర్ చికెన్	: 153



నిమ్మ ధరలు (కిలో)

పెద్దవి	: రూ.100
సన్నవి	: రూ.60
పండ్లు	: రూ.40



మద్యం, చీరలు స్వాధీనం

నెల్లూరు(క్రైమ్): అక్రమంగా తరలిస్తున్న మద్యం, ఎలాంటి బిల్లులు లేకుండా తరలిస్తున్న చీరలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. వివరాలిలా ఉన్నాయి. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో కొంతకాలంగా పోలీసు అధికారులు జిల్లా వ్యాప్తంగా తనిఖీలు నిర్వహిస్తున్నారు. అందులో భాగంగా శుక్రవారం రాత్రి నుంచి శనివారం వరకు తనిఖీలు చేపట్టారు. నవాబుపేట పరిధిలో ఎలాంటి బిల్లులు లేకుండా తరలిస్తున్న రూ.2 లక్షలు విలువ చేసే 669 చీరలను స్వాధీనం చేసుకున్నారు. కలువాయి పరిధిలో 45, ఏఎస్‌పేటలో 7, ఉదయగిరిలో 16, కావలి రూరల్‌లో 98, కండలేరులో 10, సోమశిలలో 10, ఎస్ఈబీ అధికారులు 141 మద్యం బాటిళ్లను అక్రమంగా తరలిస్తుండగా పట్టుకుని నిందితులపై కేసులు నమోదు చేశారు. సోమశిలలో 800 లీటర్ల బెల్లపుఊటను ధ్వంసం చేశారు.

ఇదేం పని అయ్యోరూ..

• జనసేన కార్యక్రమంలో ప్రభుత్వ టీచర్

కందుకూరు: ఎన్నికల నియమావళి ప్రకారం ప్రభుత్వ ఉపాధ్యాయులు రాజకీయ పార్టీల ప్రచారాలు, సభలు, సమావేశాల్లో పాల్గొనకూడదు. కానీ రెండు రోజుల క్రితం పట్టణంలోని 17వ వార్డు గోకరాజుపాళెంలో జరిగిన జనసేన సమావేశంలో తోట శ్రీనివాసరావు అనే ఉపాధ్యాయుడు పాల్గొనడం చర్చకు దారి తీసింది. జనసేన, బీజేపీ, టీడీపీ కూటమికి అనుకూలంగా ఆయన ప్రచారం చేశాడు. ఈ విషయంపై ఇప్పటికే ఎన్నికల అధికారులకు ఫిర్యాదు చేసినట్లు సమాచారం.



శ్రీనివాసరావు (వృత్తంలో ఉన్న వ్యక్తి)

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చాక సర్వేపల్లి ఊపిరి పీల్చుకుంది. గతంలో టీడీపీ హయాంలో పాలకుల అవినీతి, దోపిడీ, స్వార్థంతో సర్వేపల్లి విలవిల్లాడిపోయింది. కేవలం కమీషన్ల కోసం కక్కుర్తి పడిన టీడీపీ పాలకులు అభివృద్ధి కంటే జేబులు నింపుకునేందుకు ప్రాధాన్యత ఇచ్చారు. సిలికా, ఇసుక మాఫియా నుంచి రైస్ మిల్లులు, రైతు రథాలు, నీరు–చెట్టు పనుల్లో కమీషన్లు ఇలా నాటి పాలకులతో నియోజకవర్గానికి శాపంగా మారింది. వైఎస్సార్‌సీపీ పాలనలో ఆ చీకటి కాలం తెరలు తెంచుకుని అన్ని వర్గాల, విధాలా అభివృద్ధికి అడుగులు వేసింది. గడిచిన ఐదేళ్ల కాలంలో సర్వేపల్లి ప్రగతి కొత్త పుంతలు తొక్కింది. మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి ప్రత్యేక ప్రణాళిక రూపొందించి, అటు అభివృద్ధి, ఇటు సంక్షేమంతో కొత్త ఒరవడి సృష్టించారు. నిధులు సాధించి పెండింగ్ పనులను పూర్తి చేసి చూపారు.
– సాక్షి ప్రతినిధి, నెల్లూరు


పాదలకూరులోని కిసాన్‌క్రాఫ్ట్ ఫ్యాక్టరీ

అభివృద్ధి మంత్రం.. సంక్షేమ జపం

ఐదేళ్లలో సర్వేపల్లి ప్రగతి కొత్త పుంతలు

సర్వేపల్లిలో వైఎస్సార్‌సీపీ సాధించిన ప్రగతి

- సర్వేపల్లి రిజర్వాయర్, కండలేరు హైలెవల్ కాలువ ఆధునికీకరణ
- సంగం, నెల్లూరు బ్యారేజీల నిర్మాణం ద్వారా సర్వేపల్లికు సాగునీరు
- పొదలకూరులో చెరకు రైతుల పాతబకాయిల రూ.4 కోట్లు చెల్లింపు
- చుక్కల భూముల సమస్యలకు శాశ్వత పరిష్కారం
- యంత్ర సేవ పథకంలో 147 మంది రైతులకు ట్రాక్టర్లు
- ముత్తుకూరులో నాన్‌ఫిషర్‌మెన్ ప్యాకేజీకు రూ.36 కోట్లు నిధులు
- మనుబోలు వద్ద ఎన్‌హెచ్-16 హైవే పునర్నిర్మాణ పనులు పూర్తి
- వెంకటాచలంలో రూ.925 కోట్లతో క్రిప్కో, బయోసముద్ర బయో ఇథనాల్ ప్లాంట్ల నిర్మాణం
- నేలటూరులో థర్మల్ విద్యుత్ ప్లాంట్ ఏర్పాటు
- పొదలకూరులో రూ.100 కోట్లతో కిసాన్ క్రాఫ్ట్

టీడీపీ హయాంలో ప్రతీది దోపిడీ

- టీడీపీ హయాంలో కమీషన్ల కక్కుర్తి
- సాగునీటి వనరుల అభివృద్ధిని విస్మరించిన వైనం
- రైతుల పేరుతో రకరకాలుగా అవినీతి
- మిల్లర్లతో మిలాఖత్ అయి కమిషన్లతో ధాన్యం ధరలు తగ్గించిన పాలన
- నీరు-చెట్టు, రైతు రథం పథకం పనుల్లో కమీషన్లు
- నాన్‌ఫిషర్‌మెన్ ప్యాకేజీ సొమ్ములు స్వాహా

ముత్తుకూరులో పామాయిల్ ఫ్యాక్టరీలు


వ్యవసాయానికి, రైతులకు వెన్నుదన్ను

ఐదేళ్లలో సర్వేపల్లి నియోజకవర్గంలో వ్యవసాయ రంగానికి, రైతులకు వెన్నుదన్నుగా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం నిలిచింది.

- ప్రధానంగా పొదలకూరు మండలంలో రూ.39.12 కోట్లతో కండలేరు హైలెవల్ కాలువ ఆధునికీకరణ.
- రెండు ప్యాకేజీల కింద రూ.31 కోట్లతో సర్వేపల్లి రిజర్వాయర్ ఆధునికీకరణ.
- ఈ పనులు దాదాపుగా పూర్తి కావడంతో వేలాది ఎకరాలు అదనంగా సాగులోకి వస్తున్నాయి. కాలువలకు లైనింగ్ పనులు చేపట్టడంతో సాగునీరు సవ్యంగా అందుతుంది. సంగం, నెల్లూరు బ్యారేజీల ద్వారా సర్వేపల్లి నియోజకవర్గంలో కనుపూరు కాలువ ద్వారా పొదలకూరు, వెంకటాచలం, మనుబోలు, ముత్తుకూరు, టీపీగూడూరు మండలాల్లో సాగునీటి బెంగ తీరింది.
- వైఎస్సార్ యంత్రసేవా పథకం ద్వారా 147 మంది రైతులకు ట్రాక్టర్లను అందజేశారు.

చుక్కల భూములకు శాశ్వత పరిష్కారం

జిల్లాలో చుక్కల భూములకు ఒక్క జీఓ ద్వారా శాశ్వత పరి ష్కారం లభించింది. 22ఏ నిషేధిత జాబితాలో భూముల రైతులకు పరిష్కారం లభించడంతో వారి ఆనందానికి అవధుల్లేవు. జిల్లాలో 23,023 మంది రైతులకు సంబంధించిన 43,270 ఎకరాల చుక్కలు భూములు, 2,527 మంది రైతులకు సంబంధించిన 22ఏ నిషేధిత భూములు 3,756 ఎకరాల భూములకు శాశ్వత పరిష్కారం లభించింది.

నాన్‌ఫిషర్‌మెన్‌కు అండదండా

ముత్తుకూరు మండలం కృష్ణపట్నం పోర్టు నిర్మాణంతో నిర్వాసితులైన నాన్‌ఫిషర్‌మెన్‌కు వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అండగా నిలిచింది. నాన్‌ఫిషర్‌మెన్‌కు పరిహారం భృతి పేరుతో ప్యాకేజీలను టీడీపీ హయాంలో సోమిరెడ్డి బొక్కేస్తే.. మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి ఆ ప్రతి కుటుంబానికి న్యాయం చేశారు. నాన్‌ఫిషర్‌మెన్ పరిహారంపై సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి రూ.36 కోట్లను పంపిణీ చేశారు.

పారిశ్రామికాభివృద్ధి

సర్వేపల్లి నియోజకవర్గంలో పరిశ్రమల స్థాపన కొనసాగుతోంది. వైఎస్సార్‌సీపీ ఏర్పడిన తర్వాత పరిశ్రమల స్థాపన ఊపందుకుంది. నేలటూరు థర్మల్ విద్యుత్ ప్లాంట్‌తో పాటు, వెంకటాచలం మండలం సర్వేపల్లిలో రూ.610 కోట్లతో క్రిప్కో బయోఇథనాల్ ప్లాంట్, రూ.315 కోట్లతో విశ్వసముద్ర బయోఇథనాల్ ప్లాంట్ల నిర్మాణాలు జరుగుతున్నాయి. పొదలకూరు మండలంలో రెండేళ్ల క్రితం వ్యవసాయ పనిముట్లు, యంత్రాల తయారీ కోసం కిసాన్ క్రాఫ్ట్ పరిశ్రమను రూ.100 కోట్లతో స్థాపించారు. ఇక్కడ స్థానికులకు 75 శాతం ఉద్యోగాలను కేటాయించడం విశేషం.

రహదారుల నిర్మాణానికి ప్రాధాన్యత

గత టీడీపీ హయాంలో 2015లో వచ్చిన వరదకు దెబ్బతిన్న మనుబోలు వద్ద ఎన్‌హెచ్ 16 హైవే రోడ్డు పనులను రూ.135 కోట్లతో పునర్నిర్మాణం చేసి ప్రారంభించారు. హైవే పనులను పట్టించుకోక పోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొనే వారు. సర్వేపల్లి నియోజకవర్గంలో మౌలిక వసతులైన అంతర్గత సిమెంట్ రోడ్లు, సైడ్ డ్రెయిన్ల నిర్మాణం కోసం రూ.320 కోట్ల పనులను పూర్తి చేశారు. రాష్ట్రంలో ఎక్కడ జరగని విధంగా సర్వేపల్లిలో పనులు పూర్తికావడం గమనార్హం. నియోజకవర్గంలోని ఒక్క పొదలకూరులోనే రూ.100 కోట్ల వరకు కేటాయించారు.

ఆత్మకూరు నుంచి గెలిచి.. అత్యున్నత పదవులు అలంకరించి..

హిస్టరీ

ఆత్మకూరు: జిల్లాలో ఆత్మకూరు నియోజకవర్గానికి రాష్ట్రంలో ప్రత్యేక స్థానం ఉంది. ఈ నియోజకవర్గం నుంచి గెలిచిన ఎందరో అత్యున్నత పదవులు అలంకరించి రాష్ట్ర స్థాయిలో రాణించారు. స్వాతంత్ర్యానంతరం 1952లో మొట్ట మొదటిసారి జరిగిన ఎన్నికల్లో ఆత్మకూరు అసెంబ్లీకి స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేసిన గెలిచిన గంగా చిన్నకొండయ్య.. ఆ తర్వాత కాలంలో జనతా పార్టీ రాష్ట్ర నేతగా ఎదిగారు. 1955లో ఇక్కడ నుంచి ఎమ్మెల్యేగా ఎన్నికైన బెజవాడ గోపాల్‌రెడ్డి రాష్ట్ర ముఖ్యమంత్రిగా, కేంద్ర మంత్రిగా, ఉత్తరప్రదేశ్ గవర్నర్‌గా పలు పదవుల్లో కీర్తిగడించారు. 1959 ఉప ఎన్నికల్లో, 1962లో ఎన్నికల్లో ఎమ్మెల్యేగా గెలుపొందిన ఆనం సంజీవరెడ్డి రాష్ట్ర మంత్రిగా, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడిగా చక్రం తిప్పారు. 1967లో జరిగిన ఎన్నికల్లో ఎమ్మెల్యేగా గెలిచిన పెళ్లకూరు రామచంద్రారెడ్డి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో కోస్తా, ప్రణాళికాభివృద్ధి మండలి చైర్మన్‌గా, జాతీయ స్థాయిలో ప్రతిష్టాత్మకమైన ఇఫ్కో సంస్థ చైర్మన్‌గా పదవులు అలంకరించారు.

1978, 1985, 1989 ఎన్నికల్లో గెలుపొందిన డాక్టర్ బి సుందరరామిరెడ్డి రెండు దఫాలు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఆర్థిక సంస్థ (ఏపీఎఫ్ఎస్ఎఫ్‌సీ) చైర్మన్‌గా కొనసాగారు. 1983లో గెలుపొందిన ఆనం వెంకటరెడ్డి నాదెండ్ల భాస్కర్‌రావు మంత్రి వర్గంలో మంత్రి పదవిని పొందారు. 1994లో ఎన్నికైన కొమ్మి లక్ష్మయ్యనాయుడు సివిల్ సప్లయిస్ కార్పొరేషన్ డైరెక్టర్‌గా పదవి అనుభవించారు. 2009లో ఆత్మకూరు నుంచి ఎన్నికైన ఆనం రామనారాయణరెడ్డి దివంగత సీఎం వైఎస్ రాజశేఖరరెడ్డి, రోశయ్య, కిరణ్‌కుమార్‌రెడ్డి మంత్రి వర్గంలో మంత్రిగా పదవులు పొందారు. 2014, 2019 ఎన్నికల్లో ఘన విజయం సాధించిన మేకపాటి గౌతమ్‌రెడ్డి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మంత్రి వర్గంలో రాష్ట్ర పరిశ్రమలు, ఐటీ శాఖల మంత్రిగా వెలుగొందారు. ఆత్మకూరు స్థానం నుంచి ఎమ్మెల్యేగా పోటీ చేసి (1985) కొద్ది ఓట్ల తేడాతో పరాజయం పాలైన ముప్పవరపు వెంకయ్య నాయుడు, అనంతరం బీజేపీ రాష్ట్ర, జాతీయ అధ్యక్షుడిగా, రెండు మార్లు కేంద్ర మంత్రిగా.. ఆ తర్వాత భారతదేశ ఉప రాష్ట్రపతిగా పదవిని అలంకరించారు.

సర్కార్ విద్య మెరుగుబడి


దుత్తలూరు మండలం బొటికర్లపాడు పాఠశాల

ఒకప్పుడు ప్రభుత్వ పాఠశాలలు కనీస వసతులు లేక కునారిల్లుతుండేవి. ఉపాధ్యాయుల కొరత, వసతుల లేమి, చదువులపై ప్రభావం చూపేవి. కానీ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం అధికారంలోకొచ్చిన వెంటనే ప్రభుత్వ పాఠశాలలు కార్పొరేట్ పాఠశాలలకంటే మిన్నగా మారాయి. ప్రాథమిక పాఠశాలలో స్మార్ట్ టీవీలు, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లో ఇంట్రాక్టివ్ ఫ్లాట్ పానల్ (ఐఎఫ్‌పీ) ద్వారా విద్య బోధిస్తున్నారు. బైజూస్ కంటెంట్ విద్యనందించేందుకు ట్యాబ్‌లు పరిచయం చేస్తున్నారు. డిజిటల్ విద్యను విద్యార్థులకు చేరువ చేస్తున్నారు. ప్రభుత్వ బడులను మనబడి నాడు–నేడు ద్వారా ఎవరూ ఊహించని విధంగా అభివృద్ధి చేశారు. విద్యార్థులకు ఆధునిక మరుగుదొడ్లు అందుబాటులోకి తెచ్చారు. మినరల్ వాటర్ ప్లాంట్లు ఏర్పాటు చేశారు. – ఉదయగిరి



కార్పొరేట్ పాఠశాలను తలపిస్తున్న జలదంకి మెయిన్ పాఠశాల


ఉదయగిరి ప్రాథమిక పాఠశాలలో నాడు-నేడు కింద ఏర్పాటుచేసిన బెంచీలు

టీడీపీకి టన్నుల్లో భయం

సార్వత్రిక ఎన్నికలకు పట్టుమని వారం రోజులు కూడా లేవు. గత ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ జిల్లాను క్లీన్ స్వీప్ చేసింది. ప్రస్తుత ఎన్నికల్లోనూ అదే గాలి ఇంకా బలంగా వీస్తుండడంతో టీడీపీలో వణుకు పుడుతోంది. ఆ పార్టీ అభ్యర్థుల్లో టన్నుల్లో భయం కనిపిస్తోంది. ప్రధానంగా నెల్లూరు సిటీ నియోజకవర్గంలో సామాన్యుడైన వైఎస్సార్‌సీపీ అభ్యర్థి చేతిలో శ్రీమంతుడైన టీడీపీ అభ్యర్థి పొంగూరు నారాయణ ఓటమి ఖాయమా? అంటే.. క్షేత్రస్థాయిలో అవుననే సమాచారం ఉండడంతో ఆ పార్టీ ఉక్కిరిబిక్కిరి అవుతోంది. అందుకే టీడీపీ క్యాంపెయినర్లు నెల్లూరులో మోహరించారని సామాన్య ప్రజల్లో చర్చ జరుగుతోంది.



- నెల్లూరు నగర టీడీపీ అభ్యర్థి బెంబేలు
- సామాన్యుడైన వైఎస్సార్‌సీపీ అభ్యర్థికి జై కొడుతున్న జనం
- టీడీపీ డబ్బులకు లొంగని సామాన్య ప్రజలు
- అందుకే మోహరించిన పచ్చదండు
- తొలుత బాలకృష్ణ, ఆ తర్వాత చంద్రబాబు ముస్లింలతో ఆత్మీయ సమావేశం
- మొన్న లోకేశ్.. నిన్న చంద్రబాబు, పవన్‌కళ్యాణ్‌తో హడావుడి

సాక్షి ప్రతినిధి, నెల్లూరు: క్షేత్రస్థాయిలో టీడీపీ గ్రాఫ్ పాతాళానికి పడిపోయింది. ప్రధానంగా నెల్లూరు సిటీ టీడీపీ అభ్యర్థి పొంగూరు నారాయణకు ఒక సామాన్యుడి చేతిలో ఓటమి తప్పేటట్లు లేదనే భయం వెంటాడుతోంది. దీంతో టీడీపీ ప్రచారకర్తలందరూ నెల్లూరు సిటీలో వరుసపెట్టి మోహరించి ప్రచారం చేస్తున్నారు. సినీగ్లామర్ ఉన్న నందమూరి బాలకృష్ణ రోడ్‌షో నిర్వహించగా, ఆ పార్టీ అధినేత చంద్రబాబు ముస్లింలతో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఆ తర్వాత లోకేశ్‌తో క్రియేటివిటీ ప్రొగ్రాం పెట్టించారు. మరో వైపు టీడీపీ వేసుకుంటున్న సెల్ఫ్ గోల్స్‌తో ఆ పార్టీ గ్రాఫ్ మరింతగా పడిపోయింది. పోలింగ్ తేదీ దగ్గర పడుతుండడంతో ఓటమి భయంతో మరోసారి చంద్రబాబు, పవన్‌కళ్యాణ్‌తో ప్రచారం చేయించారు.

టీడీపీ మేకపోతు గాంభీర్యం

గెలుపు మాదే అంటూ మేకపోతు గాంభీర్యం ప్రదర్శిస్తున్న టీడీపీ అంతర్లీనంగా ఓటమి తప్పదని నిర్ధారణకు వచ్చినట్లు ఉంది. అందుకే టీడీపీ క్యాంపెయినర్లు మొత్తాన్ని తీసుకువచ్చి ప్రచారం చేయిస్తోందని నగర ప్రజలు చర్చించుకుంటున్నారు. క్షేత్ర స్థాయిలో వైఎస్సార్‌సీపీ బలంగా ఉంది. ప్రధానంగా నెల్లూరు సిటీలో గత రెండు దఫాల ఎన్నికల్లోనూ ఆ పార్టీ విజయకేతనం ఎగురవేసింది. ఈ దఫా ఆ పార్టీ అధిక శాతం ఓటింగ్ ఉన్న ముస్లింల్లో ఒకరైన అతి సామాన్యుడికి సీటు ఇచ్చి బరిలో దింపింది. గడిచిన ఐదేళ్లుగా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అందించిన సంక్షేమం, ముఖ్యంగా కరోనా సమయంలో పనులు దొరకని పరిస్థితుల్లో ఆదుకున్న వైనంతో సామాన్య ప్రజల గుండెల్లో ఆ పార్టీ బలంగా నాటుకుపోయింది. బలంగా ఉన్న వైఎస్సార్‌సీపీని ఎదుర్కొనేందుకు టీడీపీ అభ్యర్థి నారాయణ రెండు వేల మంది సొంత టీమ్‌తో నిత్యం డోర్ టు డోర్ తిప్పుతున్నాడు. టీడీపీ అధికారంలో వస్తే మీకు ఈ విధంగా మేలు జరుగుతుందని చెబుతున్నా.. ప్రజలు నమ్మడం లేదు. ఓట్లకు నోట్లు ఇస్తామని చెబుతున్నా.. ఓట్లేస్తారనే నమ్మకం కనిపించడం లేదు. దీంతో బెంబేలెత్తుతున్న నారాయణ దింపుడు కల్లం ఆశతో చంద్రబాబు, పవన్ ప్రచారానికి తెచ్చుకున్నారని రాజకీయ విశ్లేషకులు అంటున్నారు.

జెండాలు తప్ప.. జన'సేన' ఏదీ?

టీడీపీ అభ్యర్థి నారాయణ తనకు పక్కలో బల్లెంలా ఉన్న శత్రు శేషం లేకుండా చేయడానికి నెల్లూరు సిటీ నియోజకవర్గంలో జనసేన పార్టీని కూకటి వేళ్లతో సహా పెకళించేశారు. ఏకంగా పార్టీ జిల్లా అధ్యక్షుడిగా ఉన్న నేతనే పొమ్మనలేక.. పొగబెట్టి బయటకు వెళ్లేలా చేశారు. ఇప్పటికే ఆ పార్టీలోని క్రియాశీలక నేతలందరూ జనసేనకు గుడ్‌బై చెప్పేశారు. తన ప్రచారంలో జనసేన జెండాలు తప్ప.. జన'సేన' ఎక్కడా కనిపించడం లేదు. తాజాగా పవన్‌కళ్యాణ్‌తో ప్రచారం చేయించినప్పటికీ, ఆ పార్టీ కేడర్‌తో పాటు అభిమానులు సైతం డుమ్మా కొట్టారు. పవన్ సభకు అభిమానులు పలుచగా హాజరు కావడం చూస్తే టీడీపీకి ఓట్లు వేయడానికి సిద్ధంగా లేరని అర్థమవుతోంది. సినీనటుడిగా ఆయన్ను అభిమానిస్తాం కానీ.. ఓట్లు మాత్రం వేయబోమని స్పష్టం చేస్తున్నారు. జనసేనను అభిమానించిన కుటుంబాలకు సైతం వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం సంక్షేమ ఫలాలు అందించింది. ఇప్పుడు ఆ పార్టీ ఓడిపోతే జరిగే నష్టం తమకే అని పవన్‌కళ్యాణ్ అభిమానులు బాహాటంగా చెబుతున్నారు. క్షేత్రస్థాయిలో ఇలాంటి పరిస్థితులు నెలకొన్నప్పుడు పవన్‌కళ్యాణ్‌తో చేయించిన ప్రచారంతో టీడీపీకి పెరిగే ఓట్ల గ్రాఫ్ ఏమీ ఉండబోదని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు.


కావలి: దగదర్తి మండలంలో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్‌రెడ్డికి రోజా ఇస్తున్న యువతి, చిత్రంలో ఎంపీపీ ప్రసాద్‌నాయుడు


పొదలకూరు: ఇనకుర్తిలో అభిమానులతో కలిసి ఎన్నికల ప్రచారంలో అభివాదం చేస్తున్న మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి


కోవూరు: ఎన్నికల ప్రచారంలో కోవూరులో ఓ వృద్ధురాలితో ముచ్చటిస్తున్న ఎమ్మెల్యే ప్రసన్న తనయుడు రజత్‌కుమార్‌రెడ్డి


ఆత్మకూరు: పట్టణంలోని 6,10 వార్డుల్లో వైఎస్సార్‌సీపీ అభ్యర్థులను గెలిపించాలని ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే విక్రమ్‌రెడ్డి తల్లి మణిమంజరి